క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్ట్ బోధించేందుకు అతిథి అధ్యాపకులు(01) నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హత గల వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. సెప్టెంబర్ 3న సాయంత్రం 5గంటల లోగా దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని, ఏదైనా సందేహం ఉంటే 9440020690 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

అవగాహన సదస్సు

విద్యారణ్యపురి : హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాలలో నేత్రదానంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి చంద్రమౌళి మాట్లాడుతూ చూపులేని వారికి వెలుగు ఇవ్వాలంటే నేత్రాలు దానం చేయాలన్నారు. మరణాంతరం అవయదానం, నేత్రదానంపై అవగాహన కల్పించారు. సదాశయ ఆర్గాన్ డొనేషన్ వెల్ఫేర్ ఫౌండేషన్ బాధ్యులు శ్రవణ్‌కుమార్, శంకర్‌రావు మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆ పదవీ బాధ్యతలను నిర్వర్తించిన మ్యాథ్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య నుంచి శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాస్‌ను డాక్టర్ శాస్త్రి, మల్లేశ్వర్, శ్రీనివాస్, భాస్కర్ పూలబొకేను అందజేసి అభినందించారు.

రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు త్వరగా నిర్వహించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్ : తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు త్వరగా నిర్వహించాలని కోరుతూ ఈనెల 3న హైదరాబాద్‌లోని తెలంగాణ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ హాల్‌లో అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని వరంగల్ కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో సమావేశ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు శేఖర్‌రావు, అహ్మద్ ఖయ్యూమ్, శ్రీనివాస్, ఆనంద్ మోహన్, రంజిత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా రవి

విద్యారణ్యపురి : రాష్ట్ర ఉపాధ్యాయసంఘం (ఎస్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు భీమనాథుని రవి నియమితులయ్యారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో బాధ్యతలను స్వీకరించారని ఎస్‌టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కామగోని రాంబాబు, జనరల్‌సెక్రటరీ వేమునూరి రాంబాబు తెలిపారు. ఎస్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానంద్‌గౌడ్,రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, రాష్ట్ర బాధ్యులు సుధాకర్‌రెడ్డి, సాంబయ్య, రమేశ్‌లు రవిని సన్మానించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు కివీ విద్యార్థులు

ఖిలా వరంగల్ : రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు కరీమాబాద్ రోడ్డులోని ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన కివీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల హనుమకొండ సాయిబాబా దేవాలయం ప్రాంగణంలో వరంగల్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో కివీ స్కూల్ విద్యార్థులు టి.పవన్‌కుమార్, సంజయ్ భరద్వాజ అత్యంత ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దాసు సతీశ్ మూర్తి తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, కోచ్ రవితేజ్ ప్రశంసపత్రాలు అందజేసి అభినందించారు.

నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన

మామునూరు : వరంగల్ ఆర్టీఏ జంక్షన్ సమీపంలోని బెస్తం చెరువు వద్ద విఘ్నేశ్వరుని నిమజ్జన ఏర్పాట్లను సోమవారం సాయంత్రం మామునూరు సీఐ రమేష్ పరిశీలించారు. చెరువు అంచునా బారికేడ్ల ఏర్పాట్ల పనులను చూశారు. చెరువు వద్ద భారీ క్రేన్లు అందుబాటులోఉంచుతామని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీసులు సూచించిన రూట్ మ్యాప్ ప్రకారం చెరువు దగ్గరకు గణపతులు ఊరేగింపుగా రావాలని సూచించారు.

పుస్తకావిష్కరణ

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీ తెలుగు విభాగం అధ్యాపకుడు డాక్టర్ చింతం ప్రవీణ్‌కుమార్ రచించిన సోయి బీసీ ఉద్యమ సాహిత్యం పుస్తకాన్ని ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. జ్యోతి సోమవారం ఆవిష్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కంకర పోశారు.. వదిలేశారు

- మున్సిపల్ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నిలిచిన పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఆల్ అమన్ హైస్కూల్ ఎదురుగా కంకరపోసి వదిలేసిన రోడ్డు పనులు

హన్మకొండ చౌరస్తా : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందాన, ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా అధికారుల అలసత్వంతో పనులకు మోక్షం కలగడం లేదు. మున్సిపల్ అధికారుల అలసత్వం .. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం తో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. హనుమకొండలోని 9వ డివిజన్ పరిధిలోని న్యూరాయపురలో సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేసి నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ పనులు చేపట్టకపోవడం బాధాకరం. న్యూరాయపురలోని ఆల్‌అమన్ హైస్కూల్ ఎదురుగా పెద్దమ్మగడ్డ కేయూ బైపాస్ రోడ్డు వరకు రూ.14లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి మున్సిపల్ కార్పొరేషన్ నిధులు విడుదల చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ మూడు నెలల క్రితం డ్రెయినేజీ నిర్మాణం పూర్తి చేశాడు. అయితే రోడ్డు పొడవునా కంకర పోసి వదిలేశాడు. దీంతో అటుగా వెళ్లే వాహనదారులు కంకరపై నుంచి వెళ్లాలంటే సర్కస్ ఫీట్లను చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కంకర కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నిలిచిన పనులు

పెద్దమ్మగడ్డ కేయూ బైపాస్ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కల్వర్టు సరిగా లేకపోవడతో రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదని, ఈ విషయం గత మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించినట్లు కాంట్రాక్టర్ తెలిపాడు. అంతలోనే కమిషనర్ బదిలీ కావడం, కొత్త కమిషనర్ రావడంతో పనులు నిలిచిపోయాయని వారం రోజుల్లో రోడ్డు పనులు పూర్తి చేస్తామని తెలపడం విశేషం.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఉద్యోగం కల్పించాలి

- గ్రీవెన్స్‌లో వినతిపత్రం ఇచ్చిన అయోధ్యపురం గ్రామస్తులు



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అయోధ్యపురం గ్రామస్తులు

కాజీపేట రూరల్ : అయోధ్యపురం గ్రామ మహిళలు సోమవారం కాజీపేట రైల్వే మల్టీపుల్ కోచ్ ఫ్యాక్టరీ యూనిట్‌లో తమ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. కోచ్ ఫ్యాక్టరీలో తమ భూములు కోల్పోయామని తమకు న్యాయం చేయాలని గ్రీవెన్స్‌లో అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి తమ గోడు వివరించినట్లు తెలిపారు. రైల్వే మంత్రి అశ్విని‌వైష్ణవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోచ్‌ఫ్యాక్టరీకి వచ్చినప్పుడు కూడా వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. వినతి ఇచ్చి వేడుకోగా ఆర్ఆర్ పద్ధతిన భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇస్తామని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున కలెక్టర్ ద్వారా అర్హులను ఎంపిక చేసి పేర్లను రైల్వే శాఖకు పంపించినట్లయితే న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారని తెలి పారు. ఇప్పటికైనా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తమ గోడును పట్టించుకొని కోచ్‌ఫ్యాక్టరీ యూనిట్‌లో తమకు ఉద్యోగాలు కల్పించాలని వేడుకుంటున్నట్లు మాజీ సర్పంచ్ యాదగిరి వేడుకుంటున్నారు.

సామాజిక స్పృహతో విధులు నిర్వర్తించాలి



రౌతు రమేశ్ కుమార్‌ను సన్మానిస్తున్న వెంకటయ్య

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

హసన్‌పర్తి : సామాజిక స్పృహతో విధులు నిర్వర్తించినప్పుడే ఉద్యోగులు ప్రజల మనస్సుల్లో చిరకాలం ఉంటారని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మండలంలోని నాగారం సబ్‌స్టేషన్‌లో లైన్‌ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన రౌతు రమేశ్ కుమార్ సన్మాన సభ సోమవారం ఎర్రగట్టు క్రాస్‌లోని బాలాజీ గార్డెన్‌లో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వెంకటయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని లేని పక్షంలో సమాజంలో మనుగడ లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే మోహన్ మాట్లాడుతూ రమేశ్‌కుమార్ విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తూనే దళిత హక్కుల కోసం పోరాటాలు చేశాడని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నమిండ్ల శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నీలాదేవి, ప్రవీణ్, శంకర్, రామబాబునాయక్, డీబీఎఫ్‌జాతీయ అధ్యక్షుడు వినయ్ కుమార్, కార్యదర్శి శంకర్, సీజీఎం డైరెక్టర్లు తిరుపతిరెడ్డి, దానయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి చక్రపాణి, డీబీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్, కేయూ జాక్ చైర్మన్ మంద వీరస్వామి, ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయీస్ నాయకులు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పత్తి దిగుమతులపై సుంకాన్ని రద్దు చేయాలి

వరంగల్ చౌరస్తా : పత్తి దిగుమతులపై 11 శాతం సుంకాన్ని తక్షణమే తొలగిస్తున్నట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ ప్రకటించడం దేశీయ పత్తి రైతులకు తీరని హానికరమని తక్షణమే ఈ నోటిఫికేషన్‌ను రద్దుచేసి, కనీస మద్దతు ధర రూ.10,075 ప్రకటించాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో వీరగోని శంకరయ్య అధ్యక్షతన సమావేశం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పత్తి సాగుదారులకు మరణ శాసనంగా తెచ్చిన పత్తి దిగుమతి సుంకాన్ని తొలగించాలనే నోటిఫికేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 2న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ నుంచి పోచమ్మైదాన్ రోడ్, చార్‌బౌలి, నిజాంపుర, మండిబజార్, ఎల్‌బీ.నగర్, గోవిందరాజుల గుట్ట, లక్ష్మీపూర్, కూరగాయల మార్కెట్, దేశాయిపేట, సీకేఎం కాలేజ్, లక్ష్మీ టౌన్‌షిప్, రంగనాయక దేవాలయం, సిరిస్ గ్రీన్ సిటీ, కాపువాడ, కుమ్మరివాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే చర్యలు : సీఐ



చిరువ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ రమేశ్

ఖిలా వరంగల్ : రహదారులపై ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవని మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేశ్ చిరువ్యాపారులకు హెచ్చరించారు. సోమవారం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారి ఫోర్ట్ రోడ్డు వాల్‌మార్ట్ వద్ద తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యలపై చిరువ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఖమ్మం ప్రధాన రోడ్డుకు ఇరువైపుల ట్రాఫిక్ సమస్యలు లేకుండా చిరువ్యాపారాలు చేసుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కాకుండా ప్రమాదాలను నివారించేలా సహకరించాలని కోరారు.

4న గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కాలేజి గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఈనెల 4న యూనివర్సిటీలోని సెనేట్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఉత్సవాల చైర్మన్ ఆచార్య జె.కృష్ణవేణి, కన్వీనర్ , డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య తెలిపారు. సోమవారం దీనికి సంబంధించిన ఆహ్వానపత్రంను వీసీ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డికి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రంకు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

సమగ్ర విద్యపై దృష్టి

కాజీపేట రూరల్ : కాజీపేట మాంట్‌ఫోర్ట్ పాఠశాల తమ విద్యార్థులను ఆనందంగా, అర్థవంతంగా, చేతితో చేసుకుంటూ నేర్చుకునే విధంగా సమగ్ర విద్యపై దృష్టి పెట్టి, రోజువారీ జీవితంలోని చిన్న చిన్న విషయాలను అర్థం చేసుకొని వాటి విలువను గుర్తించేలా విద్యార్థులను సిద్ధం చేస్తుందని ప్రిన్సిపాల్ జి.విన్సెంట్‌రెడ్డి అన్నారు. సోమవారం వైస్ ప్రిన్సిపాల్ లూర్దురాజ్ ఆధ్వర్యంలో మాంట్‌ఫోర్ట్ స్కూల్ సీబీఎస్ఈలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల ఫ్రూట్స్ డే, వెండర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

రామన్నపేట : నగరంలోని ఎంజీఎం హాస్పిటల్ షెడ్ పక్కన గుర్తు తెలియని మహిళ మృతి చెందిందని మట్టెవాడ సీఐ కర్ణాకర్ తెలిపారు. మహిళ సుమారు 5.2 అడుగులు, నలుపు రంగు, వయస్సు 50 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా ఎంజీఎం హాస్పిటల్ ప్రాంతంలో భిక్షాటన చేస్తూ తిరిగేదని స్థానికులు తెలిపినట్లు వివరించారు. సమాచారం తెలిస్తే మట్టెవాడ ఎస్‌హెచ్‌ఓ 87126 85117, పోలీస్‌స్టేషన్ 87126 85005 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రిజర్వేషన్ అమలు చేయాలి

హన్మకొండ : టీజీ ఎన్పీడీసీఎల్‌లో చేపడుతున్న అభివృద్ధి పనుల టెండర్లలో రిజర్వేషన్లు అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని ఎన్పీడీసీఎల్ ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లు కోరారు. సోమవారం హనుమకొండలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లు ముత్యాల సుధాకర్, గుగులోతు వాలునాయక్ కలిసి వినతిపత్రం అందించారు.

సీపీఎస్ రద్దు చేయాలని ధర్నా



ధర్నాకు హాజరైన జిల్లా సంఘం బాధ్యులు

కాజీపేట : పీఆర్‌టీఎస్ రాష్ట్ర కమిటీ ఆదేశం మేరకు సీపీఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌తో హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో సోమవారం జరిగిన ధర్నాకు కాజీపేట మండల బాధ్యులు తరలివెళ్లారు. మండల శాఖ అధ్యక్షుడు శ్రీదేవిరెడ్డి మాలకొండ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు ఈ ప్రాంత ఉపాధ్యాయులు భారీగా తరలిపోయారు. తరలిన వారిలో జిల్లా సంఘం బాధ్యులు హన్మా నాయక్, దండ కోమల్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు భాస్కర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కాజీపేట అర్బన్ : పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కడిపికొండలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

కేయూలో వనమహోత్సవం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని ఇంగ్లీష్ విభాగం, స్టాటిస్టిక్స్ విభాగం ఆవరణలో సోమవారం వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ రకాల మొక్కలను నాటారు. ఇంగ్లీష్ విభాగం అధిపతి డాక్టర్ మేఘనరావు, స్టాటిస్టిక్స్ విభాగం అధిపతి డాక్టర్ జె.శ్రీనివాస్ మొక్కలను నాటారు.

న్యూశాయంపేట: గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఘనంగా వనమహోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం బాదావత్ దస్రునాయక్ పాఠశాల విద్యార్థులందరికీ ఒక్కో మొక్కను ఇచ్చి ఒక చెట్టు ఆకారంలో కూర్చుండబెట్టి పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు అని అవగాహన కల్పించారు.

ప్రవీణ్ దేవానంద్‌కు అవార్డు ప్రదానం



హన్మకొండ : హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ అధ్యాపకుడు ఎర్లీ కెరీర్ రికగ్నిషన్ ఇన్‌ఫార్మసీ ఎడ్యుకేషన్ అవార్డును అందుకున్నారు. డెన్మార్క్ దేశం కోపెన్‌హగన్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫార్మసీ కాంగ్రెస్–2025 జరిగింది. 120కి పైగా దేశాల నుంచి 3300 మంది ప్రతినిధులు ఈ కాంగ్రెస్‌లో పాల్గొన్నారు. ఈ సదస్సులో ప్రతీ ఏడాది 5 వ్యక్తిగత అవార్డులు ప్రదానం చేస్తారు. ఫార్మసీరంగంలో విశేష కృషి చేస్తున్న ప్రవీణ్ దేవానంద్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసి అవార్డు ప్రదానం చేశారు. ఫార్మసీ రంగంలో ప్రపంచవ్యాప్తంగా కొత్త కొత్త పరిశోధనలు, అన్వేషణలను డాక్టర్ ప్రవీణ్ దేవానందన్ అనుసరిస్తూ మార్పుకు తగ్గట్లుగా తమ విద్య బోధనలు, పరిశోధనలకు ఈ అవార్డు వరించింది.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

విద్యారణ్యపురి : విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని చెడు మార్గాలను అనుసరించొద్దని ఎయిడ్స్ బారిన పడొద్దని కేడీసీ ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాస్ అన్నారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్, హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రోగ్రాం మేనేజర్ ఈశ్వర్ మాట్లాడుతూ ఎయిడ్స్ అనేది పలు విధాలుగా సోకుతుందని వివరించారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

హసన్‌పర్తి: విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టితో వాసవిక్లబ్ ముందుకు సాగుతోందని ఆ క్లబ్ ఇంటర్నేషన్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు అన్నారు. క్లబ్ వ్యవస్థాపకుడు కేసీ గుప్త జయంతిని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో వేడుకలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చెక్కులను అందించారు.

సెల్ టవర్‌పై చిక్కిన కాకి

- ప్రాణాలను కాపాడిన ఫైర్‌మన్



ఖిలా వరంగల్ : ప్రమాదవశాత్తు సెల్ టవర్ తీగల్లో చిక్కిన కాకిని ఫైర్‌మన్ తన ప్రాణాలను ఫణంగా పెట్టి కాకిని కాపాడి సురక్షితంగా వదిలేసిన ఘటన సోమవారం ఉదయం 39వ డివిజన్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. సాకరాశికుంట ప్రాంతంలోని ఓ ప్రైవేట్ కంపెనీ సెల్‌టవర్‌పై ప్రమాదకరమైన తీగల్లో కాకి చిక్కి వేలాడుతూ కా ..కా మంటూ బిగ్గరగా అరుస్తోంది. కాకి బాధను చూసిన స్థానిక ప్రజలు ఎట్టకేలకు వరంగల్ అగ్నిమాపకశాఖ అధికారులు సమాచారం అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫైర్ ఆఫీసర్ నవీన్, ఫైర్‌మన్స్ ప్రసాద్, సిబ్బందితో కలిసి సెల్ టవర్ వద్దకు చేరుకున్నారు. ప్రసాద్ ప్రమాదకరమైన సెల్‌టవర్ ఎక్కి తీగల్లో చిక్కిన కాకిని కాపాడి కిందికి తాత్కాలిక చిక్సిత అందజేసి వదిలేశారు. కాకి ప్రాణాలను కాపాడిన ఫైర్‌మన్ ప్రసాద్‌ను స్థానిక ప్రజలు కలిసి శాలువాలు కప్పి అభినందించారు.

ఆలయానికి దాతల విరాళం

మడికొండ : మడికొండలో పాత పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న పోచమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందజేశారు. మూల హేమలత –ఐలయ్య దంపతులు రూ. 10వేలు, గిన్నారపు ప్రభాకర్ కుటుంబ సభ్యులు రూ. 8వేలు, అలాగే గ్రామానికి ఎందిన బోడ్ల శ్యామ్ కుటుంబ సభ్యులు రూ. 5వేల విలువ చేసే కంకరను విరాళంగా అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

శ్వేతార్కలో ఘనంగా జేష్ఠాదేవి పూజలు



జేష్ఠాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

కాజీపేట : పట్టణంలోని స్వయంభు శ్రీ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో బ్రహ్మోత్సవ వేడుకలను పురస్కరించుకుని సోమవారం మహిళా భక్తులు జ్యేష్ఠాదేవి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి శతాధిక నారికేళ పానీయంతో అభిషేకం నిర్వహించారు. 308 కిలోల పసుపును భక్తుల నుంచి సేకరించి అయిదున్నర ఫీట్ల ఎత్తుతో గౌరమ్మను తయారు చేశారు. దేవాలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు ఐనవోలు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణశర్మలు భక్తులచే గౌరీపూజ చేయించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శర్మ మాట్లాడుతూ జేష్ఠాదేవి పూజల వల్ల కలిగే ఫలితాలపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పూజా కార్యక్రమంలో ఉత్సవాల ఇన్‌చార్జ్ తుమ్మ శ్రీనివాస్, కె.భాస్కర్ రావు, కె.రమాదేవి, రజిత, అనురాధ, ఉమాదేవి, సాయికుమారి, శ్రీనమ్మ, విజయలక్ష్మి, విజయకోటి, సులోచన, సుజాత, సరోజన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పఠనోత్సవం

విద్యారణ్యపురి: హనుమకొండలోని లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పఠనోత్సవం నిర్వహించారు. స్కూల్ ఆవరణలోని మైదానంలో విద్యార్థినులను కూర్చోబెట్టి వివిధ కథల పుస్తకాలు ఇవ్వగా వారు ఆసక్తిగా చదువుకున్నారు. పలువురు విద్యార్థినులు కథలను చదివి ఇతర విద్యార్థినులకు వినిపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. ఈనెల 15 వరకు ప్రతిరోజు పాఠశాలల్లో పఠనోత్సవాన్ని నిర్వహించాలనేది పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలతో ఈ పఠనోత్సవాన్ని నిర్వహించారు.

'మెడికవర్'లో అరుదైన ఏటీ శస్త్రచికిత్స

కాజీపేట అర్బన్ : హంటర్‌రోడ్డులోని మెడికవర్ హాస్పిటల్ వైద్యులు నగరానికి చెందిన తిరుపతికి ఆర్టీరియల్ త్రోమ్‌బెక్టోమీ(ఏటీ) అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి కాపాడారు. హాస్పిటల్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్సల్టెంట్ కార్డియోథరాసిక్ వ్యాస్కులర్ సర్జన్, న్యూరాలజిస్ట్ ప్రియాంకలు వివరాలను వెలడించారు. నగరానికి చెందిన తిరుపతి ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిన రోజే కుడి చెయ్యిలో విపరీతమైన నొప్పి రావడంతో స్థానిక వైద్యుని సంప్రదించగా రక్తప్రసరణ ఆగిపోవడం నిర్ధారించి మెరుగైన వైద్యానికి మెడికవర్‌కు తరలించారు. కుడి చెయ్యి రక్తనాళాల్లో బ్రేచియల్, రేడియల్ అండ్ ఆల్‌నర్ ఆర్టరీస్, త్రోమ్‌బాసీస్‌గా గుర్తించి ఏటీ శస్త్ర చికిత్సను నిర్వహించగా కుడి చెయ్యి కోల్పోకుండా కాపాడినట్లు తెలిపారు. కాగా బ్రెయిన్ స్ట్రోక్, బహుళ రక్తగడ్డల సమస్యకు యాంటి ఫాస్ఫోలిడ్ సీండ్రోమ్‌గా గుర్తించి చికిత్సను ప్రారంభించినట్లు తెలిపారు.

విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



విశ్వనాథకాలనీలో విఘ్నేశ్వరున్ని దర్శించుకుంటున్న భక్తులు

ఖిలావరంగల్ : వరంగల్ రంగశాయిపేటలోని మహంకాళీ దేవాలయం ప్రాంగణంలో మహంకాళి యూత్ వారి ఆధ్వర్యంలో మండపంపై ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరుడికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు శర్మ నేతృత్వంలో వినాయకుడికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శంభునిపేట విశ్వనాథ కాలనీలో ఆలయ చైర్మన్ కర్నె రవీందర్, వేద పండితులు కోటయ్య శర్మ నేతృత్వంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టీపీసీసీ నేతల పూజలు

కాజీపేట రూరల్ : డీజిల్‌కాలనీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన 32 అడుగుల వినాయకుడి విగ్రహాన్ని సోమవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు ఈవీ.శ్రీనివాస్‌రావు, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలకు సుఖ శాంతులు, అభివృద్ధి కలుగాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, నగేష్, రవి, వంశీ, రాజు, ఆకాష్, వేణు, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని రాజనీతిశాస్త్ర విభాగంలో అలుమ్ని కమిటీ హాల్‌లో ద్రవి డియన్ పొలిటికల్ సైన్స్ అసోసియేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య, బీఓఎస్ చైర్మన్ గడ్డం కృష్ణయ్య, బాధ్యులు డాక్టర్ పి కొమురయ్య, సత్యనారాయణ, వి.నాగరాజు, సోమలింగం, నరేష్‌కుమార్, కె ప్రశాంత్, శ్రవణ్‌కుమార్, గుండు సురేష్, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

దర్గా పీఏసీఎస్‌లో సభ్యత్వ నమోదు

మడికొండ: దర్గా పీఏసీఎస్‌లో సోమవారం కాజీపేట మండలం మడికొండలోని 30 మంది రైతులు సొసైటీలో డైరెక్టర్ దువ్వ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, బిల్లా రవీందర్, బైరి కొంరయ్య, మెట్టుగుట్ట మాజీ చైర్మన్ అల్లం శ్రీనివాస్, పల్లపు అర్జున్, 46వ డివిజన్ అధ్యక్షుడు వస్కుల నాగరాజు, శంకర్, గ్రామ అధ్యక్షుడు దువ్వ విజయ్ పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై కాంగ్రెస్ సంబురాలు



మడికొండ : స్వీట్లు తినిపించుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మడికొండ : స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీ బిల్లును ఆమోదించినందుకు పార్టీ నాయకులు మడికొండ చౌరస్తాలో సంబురాలు నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు చౌరస్తాలో నియోజకవర్గ ఓబీసీ చైర్మన్ నార్లగిరి కుమారస్వామి, 64వ డివిజన్ అధ్యక్షుడు కుర్ల మోహన్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లను పంపిణీ చేసుకున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

హసన్‌పర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ మంత్రివర్గం ఆమోదం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, దేవస్థాన చైర్మన్ వెంకటస్వామి, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, దేవస్థాన మాజీ చైర్మన్ రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌లు పూర్తి చేసి నీళ్లు అందించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

న్యూశాయంపేట : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్ట్‌లను పూర్తి చేసి ప్రతీ ఎకరాకు నీళ్లు అందించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సీపీఐ వరంగల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందించారు.

నిషేధిత గుట్కాలు స్వాధీనం

మడికొండ: ప్రభుత్వం నిషేధించిన పొగాకు గుట్కాలను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి కథనం ప్రకారం.. పక్కా సమాచారం మేరకు పోలీసులు సోమవారం పెట్రోలింగ్ చేస్తుండగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కడిపికొండకు చెందిన బస్కె రవి గుట్కాలను విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వాటి విలువ సుమారు రూ.3,250 ఉన్నట్లు తెలిపారు. గుట్కాలను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు.

రామన్నపేట : మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రభుత్వ నిషేధిత గుట్కా, తంబాకు విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు జరిపిన దాడుల్లో వ్యాపారి కొలరియా ముకేష్ వద్ద రూ. 1,06,204 అంబర్, బాబా, బాబాప్లస్, బాబా బ్లాక్ ప్యాకెట్లతో పాటు ఒక ద్విచక్ర వాహనం సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిందితుడిని తదుపరి విచారణ కోసం పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. ఎవరైనా నిషేధిత వస్తువులు అమ్మితే చర్యలు తీ సుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్, ఎస్సై వంశీకృష్ణ పాల్గొన్నారు.